జిల్లా అభివృద్ధి కోసం పాదయాత్ర

- ప్రాజెక్టులు పూర్తి చేసే వరకు పోరాటం - సిపిఎం మహా పాదయాత్రలో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/గోనెగండ్ల

సిపిఎం పాదయాత్ర అధికారం కోసం కాదని, జిల్లా అభివృద్ధి కోసం చేసే పాదయాత్ర అని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేసే వరకు పోరాటం సాగిస్తామన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన మహా పాదయాత్ర శుక్రవారం మూడో రోజు సాగింది. గోనెగండ్ల నుంచి ప్రారంభమైన పాదయాత్ర హెచ్.కైరవాడి, పుట్టపాశం, వెముగోడు, వర్కూరు మీదుగా కోడుమూరు వరకు సాగింది. ప్రతి గ్రామంలోనూ పాదయాత్ర ఉద్దేశాన్ని తెలుపుతూ పాదయాత్ర బృందం ముందుకు సాగింది. హెచ్.కైరవాడిలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాను పూర్తిగా విస్మరించాయని తెలిపారు. తుంగభద్రలో ప్రతేడాది 100 టిఎంసిల నీరు వృథాగా పోతోందని చెప్పారు. ఎల్ఎల్‌సి కింద పూర్తి ఆయకట్టుకు నీరు రావడం లేదన్నారు. మేళిగనూరు వద్ద వరద కాలువ నిర్మించాలని చాలా మంది ఇంజినీర్లు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ కూడా వృథాగా పోతోందని తెలిపారు. ప్రభుత్వాలు కర్నూలు జిల్లాపై నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. జిల్లాకు ఇప్పటివరకు ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, చదువుకున్న వారికి ఉద్యోగాలు లేవని తెలిపారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, సాగునీటి ప్రాజెక్టులు తక్షణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. జిల్లాలో విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఈ పోరాటానికి మద్దతు తెలపాలని, ఈనెల 7న నిర్వహించే మహా ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు మాట్లాడారు. సమగ్రాభివృద్ధిని కోరుకుంటూ యాత్ర నిర్వహిస్తున్నట్లు, జిల్లా సంక్షేమాన్ని కోరుతూ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు యాత్ర సాగిస్తున్నామని తెలిపారు. పాలకుల మెడలు వంచేలా ప్రజలను చైతన్యం చేయాలని గ్రామాల్లో యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. నిలదీసేవారుగా ప్రజలు తయారు కావాలన్నారు. పుట్టపాశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నగేష్ మాట్లాడుతూ... చాలా మంది అధికారం కోసం పాదయాత్ర చేస్తున్నారని, వారి పాదయాత్రకు, సిపిఎం పాదయాత్రకు తేడా ఉందని తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈ పాదయాత్ర చేస్తున్నామని చెప్పారు. సిపిఎం కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, జి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మహాపాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు



షడ్రక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

షడ్రక్ వర్ధంతి సందర్భంగా నివాళి...

ఉమ్మడి కర్నూలు జిల్లా ఉద్యమ నిర్మాత టి.షడ్రక్ వర్ధంతి సందర్భంగా పాదయాత్రలో నివాళులర్పించారు. హెచ్.కైరవాడిలో షడ్రక్ చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆయన స్ఫూర్తితో పోరాటాలు సాగించాలని తెలిపారు.

అలరించిన అభ్యుదయ గేయాలు...

పాదయాత్ర సందర్భంగా ప్రజా నాట్య మండలి కళాకారులు అభ్యుదయ గేయాలతో అలరించారు. ప్రతి గ్రామంలో పాటలు పాడుతూ ప్రజలను చైతన్య పరిచారు.

నేడు పాదయాత్ర ఇలా..

సిపిఎం చేపట్టిన మహా పాదయాత్ర నాలుగో రోజు కోడుమూరు నుంచి ప్యాలకుర్తి, పెంచికలపాడు మీదుగా నాగలాపురం వరకు సాగనుంది.

సాగు, తాగునీటి సమస్యకు

పరిష్కారం కరువు

- చేనేత కార్మికుల సంక్షేమం పట్టని పాలకులు
- డిగ్రీ , ఐటిఐ కళాశాల ఏర్పాటు పై నిర్లక్ష్యం
- నేడు కోడుమూరులో సిపిఎం మహా పాదయాత్ర

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కోడుమూరు ప్రజలకు సాగు ,తాగునీటి సమస్యకు పరిష్కారం చూపడంలో పాలకులు విఫలమవుతున్నారు. ఈ ప్రాంతంలోని చేనేత కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారు. విద్యార్థుల కోసం డిగ్రీ , ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయలేదన్నారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా సమగ్ర అభివద్ధికై సాగుతున్న మహాపాదయాత్ర శనివారం కోడుమూరు నియోజకవర్గంలో పర్యటించనుంది. ఈ ప్రాంతానికి చెందిన కోట్ల విజయభాస్కర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. ఆయన తనయుడు కేంద్ర రైల్వే సహాయక శాఖ మంత్రిగా ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. ఇంత చరిత్ర ఉన్నటువంటి కోడుమూరుకు సాగు,తాగునీటి సమస్య వేధిస్తుంది. ఎల్ఎల్‌సి కింద దాదాపుగా 25 వేల ఎకరాలు, గాజులదిన్నె ప్రాజెక్టు కింద దాదాపుగా 17000 ఎకరాల సాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో రైతులకు ఎల్ఎల్‌సి , జిడిపి కింద పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు విడుదల చేసిన దాఖలాలు లేవు. ప్రధానంగా కోడుమూరు పట్టణ , గ్రామాల ప్రజలకు అందరి నదితీరాన ఉన్నా తాగునీటి సౌకర్యానికి నోచులోదు. జిడిపి నుండి హంద్రీకి నీటిని విడుదల చేస్తే ఈ ప్రాంతంలోని ప్రజలకు తాగునీరు అందుతుంది. గత కొన్ని జిడిపి నుండి పూర్తిస్థాయిలో తాగునీటి సౌకర్యం లేక ప్రజలు తీవ్రఅవస్థలు పడుతున్నారు. మరో అదనంగా సమ్మర్ స్టోరేజ్ బ్యాంకును నిర్మిస్తే తప్ప తాగునీటి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ చేనేత కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ వారి సంక్షేమానికి మాత్రం ప్రజా ప్రతినిధులు తీసుకున్న చర్యలు నామ మాత్రమే. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. చేనేతలకు ప్రభుత్వం కేవలం ఆర్థిక సాయం మంజూరు చేస్తుంది కానీ సబ్సిడీ కింద ముడి సరుకులు అందజేసి వారు తయారు చేసిన వస్త్రాలకు నేరుగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఈ చేనేత వత్తిపై ఆధారపడిన కార్మికుల కుటుంబాలు దయనీయమైనస్థితిలో ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలోని ప్రజలు డిగ్రీ కళాశాల ఇక్కడ ఏర్పాటు చేయాలని, పాలక ప్రభుత్వాలకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. డిగ్రీ కోర్సుల అభ్యసించడానికి ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో అనేకమంది ఇంటర్ వరకే తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించి నడి మధ్యలోనే ఆపేస్తున్నారు. వెంటనే ఇక్కడ డిగ్రీ కళాశాలతో పాటు ఐటిఐ కళాశాల కూడా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇక్కడున్న ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చి అభివృద్ధి చేయాలని విన్నవించుకుంటున్నారు.

కోడుమూరు అభివృద్ధిపై గొంతెత్తే వారే కరువు

- గపూర్ మియా, సిపిఎం మండల కార్యదర్శి



కోడుమూరు ప్రాంత అభివద్ధిపై గొంతెత్తే వారే కరువయ్యారు. ఈ ప్రాంతంలోని ప్రజలకు సాగు తాగునీరు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. అనేక గ్రామాల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఇక్కడ ఉన్నటువంటి సమస్యలకు పరిష్కారం చూపడం లేదు. ఈ ప్రాంత సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఇదివరకే అనేక పోరాటాలను చేపట్టారు. సిపిఎం మహా పాదయాత్ర లో ఈ ప్రాంత సమస్యలను గుర్తించి పాలకుల దృష్టికి తీసుకు వెళ్తున్నాం.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

- లక్ష్మన్న జిల్లా అధ్యక్షులు, చేనేత కార్మిక సంఘం



చేనేత కార్మికులను అన్ని విధాలుగా పాలకులు ఆదుకోవాలి. చేనేత వత్తి ద్వారా తయారు చేసిన వస్త్రాలకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. చేనేత వస్త్రాలకు తయారుచేసే ముడి సరుకులను సబ్సిడీ కింద అందజేయడమే కాకుండా అన్ని రకాల సంక్షేమ చర్యలు తీసుకోవాలి.

మహిళలను మరింత బానిసలుగా చేస్తారా?

- సనాతన ధర్మాన్ని పాఠశాలలో బోధించడం సరికాదు
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరే షన్

దేవాదాయ శాఖ పాఠశాలల్లో సనాతన ధర్మాన్ని బోధించాలని చెప్పి మహిళలను మరితం బానిసలను చేస్తారా అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం హింసపై మహిళల పోరుయాత్ర బస్సు జాతా కర్నూలు చేరిన సందర్భంగా సుందరయ్య సర్కిల్లో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. మహిళను సనాతన ధర్మం పేరుతో కేంద్ర ప్రభుత్వం మహిళను కార్యేషు దాసి లా చేయాలనుకుంటుందని అన్నారు. రాజ్యాంగం 18 సంవత్సరాల వయస్సు వచ్చినవారికి ఓటు హక్కు కల్పిస్తే 18 సంవత్సరాల వయస్సు గల స్త్రీ తనభాగస్వామిని ఎంచుకొనేహక్కు లేదా అని ఆమె ప్రశ్నించారు. రాజ్యాంగం స్త్రీ, పురుషులకు సమాన హక్కులు కల్పిస్తే దేశంలో స్త్రీలకు రక్షణ కల్పించి అభివృద్ధి చేయాలన్నారు. రాజ్యాంగ ధర్మాన్ని పక్కనపెట్టి బిజెపి ప్రభుత్వం మణిపూర్‌లో మతాల మధ్య చిచ్చుపెట్టి మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారాలు చేసి చంపి రావణ కాష్టం చేస్తుందని అన్నారు. సుప్రీంకోర్టు కలగజేసుకోవడంతో నిందితులకు శిక్ష వేసిందన్నారు. బిల్కిస్‌బాను అత్యాచారం కేసులో నిందితులను జైలు నుండి విడుదల చేసి నవారిని సంస్కారవంతులుగా బిజెపి స్వాగతం పలికిందన్నారు. స్త్రీలకు పురుషులతో పాటు చదువుకునే సమాన హక్కులను కల్పించాలని అన్నారు. జగనన్న అమ్మఒడి ఆసరా లాంటివి వేసి ఆదుకున్నారు సరే మోడీ విధానాలను వ్యతిరేకించాలన్నారు. 2021 సంవత్సరంలో మహిళల మిస్సింగ్ కేసులు 33 వేల దాకా ఉన్నాయని చెప్పారు. మహిళలను అత్యాచారం చేస్తే మూడు నెలల్లో శిక్షించాలని ఉందన్నారు. కుస్తీలు పట్టే వారిపై కూడా లైంగిక వేధింపులు జరుగుతున్నాయంటే ప్రభుత్వం మహిళల పట్ల ఎలా వ్యవహరిస్తుందో తెలుస్తుందన్నారు. ప్రభుత్వాలను మార్చే సత్తా కేవలం మహిళలకే ఉందని చెప్పారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ జులై 28న హిందూపురం నుండి ప్రారంభమైన జాత నేడు కర్నూలు చేరుతుందన్నారు. మహిళలపై హింసకు కారణమైన మద్యం,మత్తు పదార్థాలను నిషేధించాలని ఈనెల 9వ తేదీ వరకు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ఐద్వా రాష్ట్ర నాయకురాలు నిర్మల మాట్లాడుతూ మహిళలు చైతన్యవంతులై ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా తమ హక్కుల కోసం పోరాడాలని చెప్పారు. కళాకారులు ఎక్కడ వచ్చింది శ్రీజాతికి స్వాతంత్రం, వట్టి కడుపులో అలుము కుంటవే 9 నెలలు దాచుకుంటావే. ఈ సృష్టికే బ్రహ్మ అమ్మ నీవు లేనిదే లేదు జన్మ అంటూనృత్య గేయాలు ఆలపించారు. ఈ సభలోఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.అరుణ, పిఎస్.సుజాత, కిరణ్మయి,ఎఎస్ పద్మ, జి ధనలక్ష్మి, యువజన మహిళ నాయకురాలు శిరీష పాల్గొన్నారు. **ఆలూరు**కు జాతా చేరుకుంది. ఈ పోరుయాత్రకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు, పంచాయతీ కార్మికులు సంఘీభావం తెలుపుతూ స్వాగతం పలికారు. ముందుగా అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎపి మోడల్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభకు ఐద్వా మండల కార్యదర్శి షేకున్‌బీ అధ్యక్షత వహించారు. యాత్ర ముందు భాగాన కళాకారులు కళా ప్రదర్శన నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుజాత, ఐద్వా రాష్ట్ర సహాయ ఉపాధ్యక్షులు అలివేలమ్మ, సావిత్రి, జిల్లా అధ్యక్షులు అరుణ, గౌరవాధ్యక్షులు ధనలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు పద్మ, కోశాధికారి పిఎస్.సుజాత, మండల అధ్యక్షులు రత్నమ్మ, గౌసియాబీ, రాధమ్మ, సిఐటియు నాయకులు కెపి.నారాయణస్వామి, షాకీర్, డివైఎఫ్ఐ నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు గిరి మూర్తి, ఉమేష్ పాల్గొన్నారు. **దేవనకొండ**కు పోరుయాత్ర చేరుకుంది. స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు అధ్యక్షత వహించారు. ఐద్వా నాయకులు అరుణ, ధనలక్ష్మి, పిఎస్.సుజాత, కెఎస్.పద్మ, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ సునీత, సిబ్బంది, శ్రామిక మహిళా సంఘం మండల నాయకులు జ్యోతి, వనిత, కవిత, లక్ష్మీనరసమ్మ, హుస్సేనమ్మ, విద్యార్థి సంఘం మాజీ నాయకులు సురేంద్ర, ప్రవీణ్ కుమార్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు. **పత్తికొండ**కు పోరుయాత్ర చేరుకుంది. ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ అధ్యక్షతన సాగింది. వ్యకాస నాయకులు సంఘీభావం తెలిపారు. కళాకారులు కళా ప్రదర్శనతో స్వాగతం పలికారు. అనంతరం పత్తికొండ పట్టణంలో అంబేద్కర్ గురుకుల పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో ఐద్వా నాయకులు, బాలికలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర కోశాధికారి సావిత్రి, గురుకుల కస్తూరిబా పాఠశాలల ప్రిన్సిపల్ షబానా, అధ్యాపకులు సంధ్య, ఉమాదేవి, ఐద్వా జిల్లా అధ్యక్షులు అరుణ, గౌరవాధ్యక్షులు ధనలక్ష్మి, కోశాధికారి పిఎస్.సుజాత, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి పెద్దహుల్తి సురేంద్ర, ఐద్వా నాయకులు వనిత, హారిక, భారతి పాల్గొన్నారు.



కర్నూలు నగరంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి



కర్నూలు నగరంలో కళాకారుల ప్రదర్శన



జీతాలు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం : యుటిఎఫ్

డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇటీవల పదోన్నతులు పొందిన ,బదిలీ అయిన ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలు ఇవ్వకపోతే ఆందోళనలో చేపడతామని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా చేశారు. జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప అధ్యక్షతన జరిగిన ధర్నాలో జయరాజు, రవికుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి రెండు నెలలయినా జీతాలు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు కూడా జీతాలు చెల్లించడం లేదన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ,ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్ ,గౌరవాధ్యక్షుడు మారెప్ప ,జిల్లా కార్యదర్శులు నవీన్ పాటి, వెంకటేశ, నరసింహ, ఖాశీం, నాగరాజు, ప్రసాదు, దుర్గా ప్రసాదు, రాఘవేంద్ర, తిమ్మన్న, వివిధ మండలాల నుండి వచ్చిన మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, పాల్గొన్నారు.

60 ఏళ్లు పూర్తి చేసుకున్న సహకార బ్యాంకు

రాయలసీమ లో ఉత్తమ బ్యాంకుగా కర్నూలు
ముఖ్యమంత్రితో అవార్డు అందుకున్న చైర్మన్, సిఇఒ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు ఆవిర్భావ దినోత్సవం , 60 యేళ్లు పూర్తి చేసుకొని 61వ వసంతంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా విజయవాడలో వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి హాజరయ్యారు. ముఖ్యమంత్రి,సహకార శాఖ ,వ్యవసాయ శాఖమంత్రి కాకాని గోవర్ధన రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ప్రారంభించారు. రాష్ట్రంలోనే 5వ అతి పెద్ద బ్యాంకుగా రూపుద్దిదుకొన్న కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకునకు వరుసగా 3వ సారి రాయలసీమలో ఉత్తమ సహకార కేంద్ర బ్యాంకుగా ఎంపిక అయింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు ,రూ.లక్షన్నర నగదు బహుమతిని బ్యాంకు పర్సన్ ఇంచార్జి కమిటీ ఛైర్‌పర్సన్ ఎస్‌వి.విజయ మనోహరి , ముఖ్యకార్యనిర్వహణాధికారి పి. రామాంజనేయులు అందుకున్నారు. ఛైర్ పర్సన్ ఎస్‌వి. విజయ మనోహరి మాట్లాడుతూ వరుసగా 3వ సారి రాయలసీమలో ఉత్తమ సహకార కేంద్ర బ్యాంకుగా అవార్డు , నగదు బహుమతిని ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోవడం చాలా సంతోషదాయకమని తెలిపారు. రాబోయే సంవత్సరాలలో బ్యాంకును రాష్ట్రంలోనే ఉత్తమ స్థానానికి తీసుకురావడానికి బ్యాంకు పాలకవర్గ సభ్యులు, సీనియర్ అధికారులు , బ్యాంకు సిబ్బంది సహకరముతో కృషి చేస్తానని తెలిపారు. ఈ అప్కాబ్ వజ్రోత్సవ వేడుకలకు బ్యాంకు తరపున పర్సన్ ఇంచార్జి కమిటీ సభ్యులు గుండం సూర్యప్రకాష్ రెడ్డి, సీమ సుధాకర్ రెడ్డి , నాసారి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరమ్మ , కె. వెంకట రమణా రెడ్డి , మూలింటి రాఘవేంద్ర హాజరయ్యారు.



ముఖ్యమంత్రితో అవార్డు అందుకుంటున్న విజయమనోహరి

రవీంద్రలో హెల్త్ క్లబ్ ప్రారంభం

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో హెల్త్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఎక్స్‌ట్రా కరికులర్ ఆక్టివిటీస్ క్లబ్ నిర్వహించే కార్యక్రమాలకు అనుబంధంగా ఇంజనీరింగ్ కళాశాలలో 'ఈ హెల్త్ క్లబ్ ఆర్ఎస్ఇడబ్ల్యుఎ స్వస్థ' అనే పేరుతో కళాశాల చైర్మన్ జివిఎం.మోహన్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, మహిళలు పెరుగుతున్న ఆధునిక జీవన విధానానికి అనుగుణంగా ఆరోగ్య సూత్రాలను పాటించాలని, అప్పుడే వారి భవిష్యత్తులో ఎదురయ్యే అనేక సమస్యలను ఎదుర్కొనే సమర్థత ఉంటుందని తెలిపారు. హెల్త్ క్లబ్ లోగోను కళాశాల చైర్మన్ ప్రిన్సిపల్ , వైస్ ప్రిన్సిపల్ ఆవిష్కరించారు. ఇంజనీరింగ్ కళాశాలలో మహిళల ఆరోగ్యం , వికాసానికి దోహదపడే హెల్త్ క్లబ్‌ను తమ కళాశాలలో ప్రారంభించడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెజె. శ్రీనివాసమూర్తి , వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎజె.ఉష్శశ్రీ హర్షం వ్యక్తం చేశారు. హెల్త్ క్లబ్‌కు కీలకపాత్ర వహించిన కళాశాల అధ్యపుకురాలు దీప్తిని అభినందించారు.



రీ సర్వే డాటా ప్రాసెసింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జెసి నారపురెడ్డి మౌర్య

విధులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో జరుగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమంలో విధులు నిర్వహించే సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని రీ సర్వే డాటా ప్రాసెసింగ్ సెంటర్‌ను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న భూముల రీసర్వేను నిర్దేశిత సమయంలో పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. రీ సర్వే డాటా ప్రాసెసింగ్ వేగవంతం చేయాలని, ప్రాసెసింగ్ చేయడంలో ఏమైనా సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. సి బెళగల్ మండలం గుండ్రేవుల, పలుకు దొడ్డి, బురాన్ దొడ్డి, పోలకల్లు, గ్రామాలలో సర్వే ప్రక్రియ మందకొడిగా జరుగుతుందన్నారు. ల్యాండ్ సర్వే ఎడి మోహన్, తహశీల్దారులు, డిప్యూటీ తహశీల్దార్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా గౌరు చరిత జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరించిన గౌరు దంపతులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత జన్మదిన వేడుకలు ఆమె స్వగహం వద్ద శుక్రవారం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును ఆమె కట్ చేశారు. నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు గౌరు చరితను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన ప్రత్యేక అనుబంధాన్ని గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి తో పాటు ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహా, ఎడిషన్ ఇన్‌ఛార్జి పానుగంటి చంద్రయ్య , కర్నూల్ డివిజన్ ఇంచార్జి ఎల్లా గౌడ్, రిపోర్టర్ నీలం సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ నవీన్ పలువురు నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, సర్పంచి సహరాబీ, ఎంపిటిసిమేకల శేషన్న, మాజీ ఎంపిపి వాకిటి మాధవి, పార్టీ నాయకులు గంగాధర్ గౌడ్, మహేష్ గౌడ్ ,ఉలిందకొండ వెంకటేశ్వర్లు, కరీం బాషా, దొడ్డిపాడు బాష, పర్ల మహానంది, సల్కాపురం దేవేందర్ రెడ్డి, పెద్దపాడు తిరుమలేష్ రెడ్డి, పెద్దటేకూరు వెంకటప్ప పాల్గొన్నారు



ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న గౌరు దంపతులు

పోరాట యోధుడు ఈశ్వర్ రెడ్డి

- ఆయన చేసిన సేవలు ఎన్నటికీ మరవలేనివి
-44వ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి-తుగ్గలి

దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే ఈశ్వర్‌రెడ్డి చేసిన సేవలు ప్రజలు ఎన్నటికీ మరువలేనివని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో ఈశ్వర్ రెడ్డి సమాధి దగ్గర పూలుమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగలో వి.రాంభూపాల్ మాట్లాడుతూ తుగ్గలి మండలంలోని వివిధ గిరిజన తండాలలో భూస్వాములను ఎదిరించి వారి దగ్గర ఉన్న భూములు అన్నిటిని గిరిజనులకు ఇప్పించారన్నారు. 1979లో సిపిఎం పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యేగా పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవలు చేశారని చెప్పారు. ఎమ్మెల్యేగా ఉన్నా స్వార్థ రాజకీయాలకు దూరంగా ఉంటూ ప్రతి సమస్యపై పోరాడిన ఏకైక వ్యక్తి ఈశ్వర్ రెడ్డి అని గుర్తు చేశారు. భూముల లేని నిరుపేదలందరికీ ప్రభుత్వంతో పోరాడి భూ పంపిణీ చేయించారన్నారు. పత్తికొండ ప్రాంతంలోనున్న గిరిజనులకు భూములు ఇప్పించి సాగులోకి తెచ్చారన్నారు. అటువంటి మహానుభావుడిని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి తనయుడు భాస్కర్ రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, పత్తికొండ మండలం కార్యదర్శి రంగారెడ్డి, కె వి పి ఎస్ జిల్లా నాయకులు రమేష్, ఆవాజ్ జిల్లా నాయకులు, తాజ్ మహమ్మద్, ఈశ్వర్ రెడ్డి మనుమడు కె.జగదీశ్వర్ రెడ్డి, కె.జగదీశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు కొండారెడ్డి, గ్రామ పెద్దలు అయ్యన్న, లింగన్న, దాసే రాముడు, వివిధ గ్రామాలకు చెందిన సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

మైపర్ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్ :

స్థానిక ఏ క్యాంపులో గల మైపర్ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యా ర్థులు పైపర్‌లో ఇంటిగ్రేటెడ్ పిహెచ్‌డి ప్రదానం చేశారు. కళాశాలలో అబి నందన సభ నిర్వహించి విద్యార్థులను అబి నందించారు. ఈ అభినందన సభకు మైపర్ ఫార్మసీ కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ , అకాడమిక్ డైరెక్టర్ స్టెల్లా సతీష్ పాల్గొన్నారు. ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ పైపర్‌లో ఎం.ఫార్మసీ పిహెచ్‌డికి అర్హత సాధించిన పి.సుధీర్ ఆల్ ఇండియా రెండో ర్యాంకు, వి.దినేష్ కుమార్ ఆల్ ఇండియా 137 ర్యాంకు, సిఎన్‌డి ప్రశాంతి ఆల్ ఇండియా 142 ర్యాంకు, సి.మాన్యా కిషోర్, ఆల్ ఇండియా 2086 ర్యాంకు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ వారితో తనకున్న అనుభవాలను పంచుకున్నారు. ఇదే సందర్భంగా జిపిఎటి-2023లో అర్హత సాధించిన సి.మన్యా కిషోర, వి.దినేష్ కుమార్, పి.సుధీర్ ,బి.శ్రావణి, ఎం.భవానిలను అభినందించారు. ప్రిన్సిపల్ జె. రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సురేష్, అకాడమిక్ డీన్ ఎం.రాజ్ కుమార్, అధ్యాపక సిబ్బంది అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిమూలపు సతీష్

సమస్యలు తెలుసుకునేందుకే 'గడపగడపకు'

- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలి పారు. శుక్రవారం పట్టణంలోని సిఆర్.నగర్, పంజరాపోల్, బీసీ లాడ్జి ప్రాంతాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ తిరుగుతూ వార్డులో మురుగు కాలువలు, వీధిలైట్లు, రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. ఇంతవరకు పథకాలు అందని వారికి వెంటనే నవరత్నాలు అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజల్లో తిరుగుతున్నప్పుడే వారి సమస్యలు తమకు అర్థమవుతాయని, ప్రతి పేదవాడి కష్టాలు తెలుసుకోగలుగుతున్నామని వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ మధుసూదన, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీరు రాజశేఖర్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, మురళీ రెడ్డి, వార్డు ఇన్‌ఛార్జీ ఎర్రి స్వామి, కామాక్షి తిమ్మప్ప, చంద్రశేఖర్ రెడ్డి, రామ్ లింగేశ్వర్, ఎంకటు, సచివాలయ సిబ్బంది, స్టేట్ డైరెక్టర్లు రేణుక, మంజుల, శ్రీలక్ష్మి, జలేఖ, శ్రీదేవి, రవి, తాయప్ప, బికె.లక్ష్మన్న, నాగరాజ్, లక్ష్మీనారాయణ, రైల్వే ఈరన్న, లాల్ బాషా, జహీర్, రాయ నగర్ చిన్న ఈరన్న, కాంట్రాక్టర్ వీరేష్, లాలప్ప ఉన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి పోరాటం

- సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్ - ఈశ్వర్ రెడ్డి, షడ్రక్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - దేవనకొండ


దేవనకొండలో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం జీవితాన్ని త్యాగం చేసిన పత్తికొండ మాజీ ఎమ్మెల్యే ఈశ్వర్ రెడ్డి, సిపిఎం జిల్లా మాజీ కార్యదర్శి షడ్రక్ స్ఫూర్తితో కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం, సాగు, తాగునీరు, మౌలిక సదుపాయాల కోసం పోరాడతామని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ తెలిపారు. శుక్రవారం దేవనకొండలోని సిఐటియు కార్యాలయంలో ఈశ్వర్ రెడ్డి 44వ వర్ధంతి, షడ్రక్ 3వ వర్ధంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు సిపిఎం నాయకులు యూసుఫ్ బాషా, బంద్వయ్యలు పూలమాలలు వేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరశేఖర్ మాట్లాడారు. ప్రజాసేవకే జీవితాలను త్యాగం చేసిన ఈశ్వర్ రెడ్డి, షడ్రక్ స్ఫూర్తితో ఈ ప్రాంతాభివృద్ధి కోసం పోరాడతామని తెలిపారు. పేదలకు భూమి, ఇల్లు, ఇళ్ల స్థలాల కోసం ఈశ్వర్ రెడ్డి, షడ్రక్‌లు పోరాటాలు చేసి, పేదలకు భూములు పంచిన చరిత్ర వారిదని చెప్పారు. అట్టడుగు వర్గాల బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తూ భూస్వామ్య, పెత్తందారీ వ్యవస్థపై పోరాటాలు చేశారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల కోసం, రైతుల అభ్యున్నతి కోసం పోరాటమే వారికి నిజమైన నివాళి అని చెప్పారు. జిల్లా సమగ్రాభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల సాధన, దేవనకొండ మండలంలో ప్రతి ఎకరాకూ నీరు అందించాలని సిపిఎం ఉద్యమిస్తోందని, ఈ పోరాటాల్లో ప్రజలు కలిసి రావాలని కోరారు. సిపిఎం కార్యకర్తలు రంగన్న, రాముడు, రాయుడు, రంగడు, సుధాకర్, బలరాముడు, తిమ్మప్ప, విశ్వనాథ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా కూరగాయల మార్కెట్ వేలం

ప్రజాశక్తి - ఆస్పరి


వేలం పాటలో మాట్లాడుతున్న అధికారులు

మండలంలోని బిణిగేరి గ్రామ సచివాలయ కార్యాలయంలో శుక్రవారం కూరగాయల మార్కెట్ వేలంపాట హోరాహోరీగా సాగింది. శుక్రవారం పత్తికొండ ఇన్‌ఛార్జీ డివిఎల్‌పిఒ ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ వేలం జరిగింది. సర్పంచి వెంకటేష్ అధ్యక్షత వహించారు. ఈ వేలం పాటలో ఐదుగురు పాడుదారులు పాల్గొనగా ఈరన్న రూ.8.20 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి నరసింహారెడ్డి, సర్పంచి వెంకటేష్ మాట్లాడారు. గ్రామంలో ఉన్న దేవాలయాల అభివృద్ధి కోసం పంచాయతీ తీర్మానం మేరకు వేలం పాటలో వచ్చిన నగదు రూ.4.10 లక్షలు కేటాయిస్తున్నామని తెలిపారు. మిగిలిన నగదు రూ.4.10 లక్షలు పంచాయతీకి జమ చేస్తామన్నారు. గ్రామ పంచాయతీ నిబంధనల మేరకే వేలం పాటను దక్కించుకున్న కాంట్రాక్టర్ నడుచుకోవాలని చెప్పారు. కార్యదర్శి నబీసాబ్, చిగిలి-2 సచివాలయ కార్యదర్శి నాగమణి, ఎంపిటిసి లక్ష్మీ, గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి, శ్వేతవాహన రెడ్డి, శేషాద్రి నాయుడు, వెంకటేశులు, సోమన్న, భీమన్న పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి - హోళగుంద

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వందవాగిలి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఆయన ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి రామలింగారెడ్డి ఇంటి వరకు సిసి రోడ్డు, డ్రెయినేజీ కోసం రూ.20 లక్షలు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వైసిపి ఆలూరు నియోజకవర్గ బాధ్యులు నారాయణస్వామి, ఎంపిడిఒ రాధ, ఎంపిపి తనయుడు ఈషా, వైసిపి మండల కన్వీనర్ షఫీవుల్లా, హౌసింగ్ ఎఇ వర్మ, పిఆర్ ఎఇ సోమప్ప, ఎఇ ఆనంద్ పాల్గొన్నారు.


హోళగుందలో లబ్ధిపత్రాలు అందజేస్తున్న

మెగా జాబ్ మేళాలో 198 మంది ఎంపిక

ఆలూరు : నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 198 మంది ఎంపికయ్యారు. శుక్రవారం ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ నిరుద్యోగ యువత కోసం ఆలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ హాజరై మాట్లాడారు. నియోజకవర్గ నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో గ్రీన్ టెక్, అమర్ రాజా బ్యాటరీస్, ఎస్‌కె బయో ఎంటర్‌ప్రైజెస్, ఎన్ లైట్ కాడ్ ఇంజినీరింగ్, టిసిఎల్, అరబిందో ఫార్మా, నవభారత్ ఫర్టిలైజర్స్, వైఎస్‌కె ఇన్ఫోటెక్, హెటిరో డ్రగ్స్, హీల్ మై ఫ్యామిలీ, డీ షైన్ ప్రో సొల్యూషన్స్, ఎల్ అండ్ టి, వివిధ కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. 442 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 198 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని తెలిపారు. అంతకుముందు స్కిల్ హబ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మంత్రి గుమ్మనూరు చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేశారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకర్ ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, వి.శ్రీకాంత్ రెడ్డి, సీడ్ హబ్ జిల్లా మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.


ఆలూరులో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు

ప్రమాదంలో చిన్నారి మృతి

ప్రజాశక్తి - నందవరం

ప్రమాదంలో చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని గంగవరంలో చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన బెస్త కృష్ణ తన బొలేరో వాహనాన్ని ఇంటి ఆవరణ నుంచి రివర్స్‌లో బయట తీస్తుండగా వెనకాలే ఆడుకుంటున్న చిన్నారి ధనుష్ (4)ను గమనించక పోవడంతో బాలునిపై వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కొనప్రాణం ఉందని బాలుని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ధనుష్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కృష్ణకు భార్యతో పాటు పాప కూడా ఉంది. పెద్ద వాహనదారులు బయటకు తీసేటప్పుడు చూసి వాహనాలను నడపాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరుతడి పంటలు మాత్రమే వేయండి : ఎఒ

ప్రజాశక్తి - హాలహర్వి

రైతులు ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని ఎఒ శివశంకర్ తెలిపారు. శుక్రవారం కామినహల్ ఆర్‌బికెలో గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో ఆరుతడి పంటలైన కొర్రలు, రాగులు, కందులు, జొన్నలు వేసుకోవాలని రైతులకు సూచించారు. రైతు భరోసా మ్యాగజైన్ చెల్లించిన రైతులకు పుస్తకాలు అందజేశారు. ఎరువులు పంపిణీ చేశారు. ఆర్‌బికెలో డిఎపి, యూరియా అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు ఎరువులు తీసుకోవాలని సూచించారు.

రాంపురం రెడ్డి సోదరులకు ఎంపీ గోరంట్ల మాధవ్ ఆహ్వానం

ప్రజాశక్తి - మంత్రాలయం

రాంపురం రెడ్డి సోదరులు, వైసిపి నాయకులు, ఎమ్మిగనూర్ ఆర్‌టిసి డిపో ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వై.సీతారామిరెడ్డిని, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని అనంతపురం జిల్లా హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ తన సోదరుడి కుమార్తె పెళ్లికి ఆహ్వానించారు. శుక్రవారం మండలంలోని రాంపురం గ్రామంలో ఎంపీ గోరంట్ల మాధవ్ వారిని కలిసి ఈనెల 21న జరిగే వివాహానికి రావాలని పెళ్లి పత్రికను అందజేశారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, కురువ సంఘం జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు కురువ మద్దిలేటి, పెద్దకడబూరు మాజీ ఎంపిపి రఘురామ్, బీరప్ప ఉన్నారు.


రాంపురం రెడ్డి సోదరులతో మాట్లాడుతున్న ఎంపీ


అవయవ దాన ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

'నవోదయ' అవయవ దాన దినోత్సవం

ప్రజాశక్తి ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం అవయవ దాన దినోత్సవం నిర్వహించారు. జవహర్ నవోదయ విద్యాలయ ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ కె.చందిరన్ మాట్లాడారు. అవయవ దానం గొప్ప దానమని, ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి ఇతరుల ప్రాణాలు కాపాడాలని కోరారు. దేశంలో సంవత్సరానికి 5 లక్షల మందికి అవయవాలు దొరకక చనిపోతున్నారని చెప్పారు. ఏటా లక్షన్నర మందికి కిడ్నీల అవసరం వస్తుంటే 5 వేల మంది మాత్రమే కిడ్నీ దాతలు లభిస్తున్నారని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ఆరోగ్యవంతులు అవయవ దానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. విద్యాలయంలో అందరితో అవయవ దాన ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస రావు, శిరీష, వెంకటయ్య, వెంకటేష్, రింకు శర్మ, అరవింద్ భట్, శ్రీలక్ష్మి, పద్మావతి, సునీత, యోగేష్ చంద్ పాల్గొన్నారు.

కార్మికుల కడుపు మాడుస్తున్న 'ఎస్ఆర్‌కె కన్‌స్ట్రక్షన్' : సిఐటియు

ప్రజాశక్తి-ఆలూరు

ఎస్ఆర్‌కె కన్‌స్ట్రక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యం కడుపు మాడుస్తోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో కార్మికులతో కలిసి మాట్లాడారు. ఎస్ఆర్‌కె కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆదోని నుంచి చింతకుంట వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులను చేపడుతోందని తెలిపారు. నిర్మాణ పనుల కోసం ఆలూరు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులతో పనులు చేయించుకొని 7 నెలలుగా జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. 'అదిగో.. ఇదిగో' అంటూ యాజమాన్యం మోసం చేస్తూ కార్మికులను, వారి కుటుంబాలను రోడ్డు పాలు చేసిందన్నారు. కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ఇతర రాష్ట్రాల కార్మికులకు వేతనాలు అందకపోగా ఆలూరు పట్టణంలో డబ్బులు అడుక్కొని వారి రాష్ట్రాలకు వెళ్లిపోయారన్నారు. ఇక్కడే ఉన్న కార్మికులకు జీతాలు ఇస్తామని ఆశలు చూపి చివరికి చేతులెత్తేశారన్నారు. కంపెనీ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ స్వామి

ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి - ఆస్పరి

ట్రిపుల్ ఐటికి ఎంపికైన ఆర్‌పి.జితేంద్ర సింగ్‌ను విజేత స్కూల్ కరస్పాండెంట్ మల్లేష్, ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విజేత స్కూల్ నుంచి ట్రిపుల్ ఐటికి ఎంపిక కావటం సంతోషంగా ఉందన్నారు. పదో తరగతి పరీక్షల్లో 586 మార్కులు సాధించి జితేంద్ర సింగ్ మండల టాపర్‌గా నిలిచారని తెలిపారు. ఉపాధ్యాయులు పద్మావతి, ఖలీల్, షేక్షావలీ, రాజు, బాలరాజు, ఆదిలక్ష్మి, కవిత పాల్గొన్నారు.

శ్రావణమాస ఉత్సవాలను జయప్రదం చేద్దాం

- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - కౌతాళం

శ్రావణమాస ఉత్సవాలను సమన్వయంతో జయప్రదం చేద్దామని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పాలకమండలి ఛైర్మన్ నాగరాజు గౌడ్, సహాయ కమిషనర్ వాణి కోరారు. శుక్రవారం ఉరుకుందలోని డార్మెటరీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నెలరోజుల పాటు జరిగే శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలకు ఆయా శాఖ అధికారులు సేవలు అందించడానికి సిద్ధం కావాలని కోరారు. ముందుగా శాఖల వారీగా పుణ్యక్షేత్రంలో వారి సేవలపై సమీక్షించారు. ఈనెల 17 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, అగ్నిమాపక, ఆర్‌టిసి, ఆరోగ్య తదితర శాఖల నుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా సేవలు అందించాలని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలూ సిద్ధం చేయడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యుత్, తాగునీరు, రోడ్డు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ఆదోని, ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపోల నుంచి కండిషన్‌లో గల బస్సులను నడిపించాలని సూచించారు. ఆయా డిపో మేనేజర్లు మాట్లాడుతూ... డిపోల నుంచి నడిపించే బస్సులు నిలవడానికి బస్టాండ్ సౌకర్యంతో పాటు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు సహకరించాలని కోరారు. సుమారు 15 నుంచి 20 లక్షల వరకు భక్తులు రావచ్చని అంచనా వేసినట్లు తెలిపారు. సిఐ ఎరిషావలీ, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ సుబ్బరాజు, ఎంపిపి అమ్రేష్, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, పాలక మండలి సభ్యులు, ఉప ప్రధాన అర్చకులు మహదేవ, పూజన్న, ముఖ్య అర్చకులు నాగరాజు, శివన్న పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రంలో అభివృద్ధి ఎక్కడ..?

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందని ఆలయ ముఖ్య అర్చకులు శివన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ... దేవాలయానికి రూ.కోట్లలో ఆదాయమున్నా, లక్షల్లో భక్తులు వస్తున్నా పుణ్యక్షేత్రంలో మాత్రం అభివృద్ధి జరగడం లేదని తెలిపారు. పుణ్యక్షేత్రానికి సమీపంలో తుంగభద్ర జలాలు పారుతున్నా, పుణ్యక్షేత్రంలో మాత్రం శాశ్వత తాగునీరు సౌకర్యం లేదన్నారు. సరైన డ్రెయినేజీ వ్యవస్థ కూడా లేదని పేర్కొన్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు సరైన సదుపాయాలు లేకపోవడంతో భక్తులు వెంటనే వెనుదిరిగి వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశాంతత కోసం వచ్చే భక్తులకు స్వామి దర్శనం తప్ప ఎలాంటి సౌకర్యాలూ లేవన్నారు. రోడ్డు మార్గాలు సరిగ్గా లేకపోవడంతో పుణ్యక్షేత్రానికి రావాలంటే భక్తులు భయపడుతున్నారని తెలిపారు. శ్రీశైలం, తిరుపతి, మహానంది, యాగంటి పుణ్యక్షేత్రాలు లాగా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పాలక మండలి ఛైర్మన్ నాగరాజు గౌడ్, సహాయ కమిషనర్ వాణిని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య అర్చకులు శివన్న


జలపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

ఎల్ఎల్‌సి కాలువకు నీటి విడుదల

- జలపూజ చేసిన నాయకులు, అధికారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

తుంగభద్ర ప్రాజెక్టు నుంచి ఎల్ఎల్‌సి కాలువకు విడుదలైన నీరు శుక్రవారం గోనెగండ్లకు చేరుకుంది. గోనెగండ్ల సెక్షన్‌కు తుంగభద్ర నీరు చేరుకోవడంతో ఎల్ఎల్‌సి గోనెగండ్ల సెక్షన్ జెఇ ఉదయభాస్కర్, మాజీ కోఆప్షన్ సభ్యులు, వైసిపి యూత్ మండల నాయకులు బందెనవాజ్ జలపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాలువకు నీరు రావడం వల్ల మండలంలో తాగునీటి కొరత తీరడంతో పాటు సకాలంలో నీరు రావడం వల్ల ఆయకట్టు పరిధిలో రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతారని తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ అర్జున్, లస్కర్ మహదేవుడు, వైసిపి నాయకులు గోవిందు, బగిలి ఉస్మాన్, కనికే పద్మనాభం, ముల్లా నదీముల్లా పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్నట్లు తహశీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని కాజీపురం, కాజీపురం కొట్టాల, బంటనహాల్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను, అందులోని వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 29 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఏ గ్రామంలోనైనా 1500 మంది ఓటర్లు పెరిగితే కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అనుమతిస్తుందని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ 21 వరకు ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చన్నారు. విఆర్ఒలు, గ్రామ సేవకులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహశీల్దార్

నూతన రోడ్డు ఏర్పాటు చేయాలి

- టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

- టిడిపి ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద, హెబ్బటం మీదుగా ఆదోని రోడ్డు, హోళగుంద, మార్లమడికి రోడ్డు పనులు వెంటనే చేపట్టి, నూతన రోడ్డు ఏర్పాటు చేయాలనిటిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం టిడిపి మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య ఆధ్వర్యంలో ఆదోని, ఎల్లార్తి రోడ్డు కూడలిలో టిడిపి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా కోట్ల సుజాతమ్మ హాజరయి మాట్లాడారు. మండలంలో ఎక్కడ చూసినా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హోళగుంద, హెబ్బటం మీదుగా ఆదోని రోడ్డు, హోళగుంద, మార్లమడికి రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పనులు మధ్యలో ఆగిపోవడంతో ఈ రోడ్డు మార్గంలో ఉన్న బస్సులను ఆర్‌టిసి అధికారులు నిలిపేశారని తెలిపారు. రవాణా సౌకర్యం లేక రైతులు, ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రోడ్డు పనులను యథావిధిగా కొనసాగించి నూతన రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రోడ్డు పనులను యథావిధిగా కొనసాగించి నూతన రోడ్డు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే అన్ని గ్రామాల రైతులు, ప్రజలను కలుపుకొని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని కైరుప్పల గ్రామంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ పద్మ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిడిపిఒ నిర్మల దేవి పాల్గొని 1, 2, 3వ అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గతంలో గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల వద్దే భోజనాలను వండి పెట్టేవారని తెలిపారు. ప్రస్తుతం ఈ పథకంలో కొన్ని మార్పులు చేస్తూ ప్రభుత్వం పౌష్టికాహార కిట్లను ప్రతినెలా ఇంటి వద్దకే అందిస్తోందని చెప్పారు. సర్పంచి తిమ్మక్క, వైసిపి నాయకులు బిటెక్ వీరభద్రి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే రాజీనామాలు

- ఎండియు ఆపరేటర్లు

ప్రజాశక్తి - నందవరం

గ్రామాల్లో విధుల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని వేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే రాజీనామాలకు సిద్ధమని మండల ఎండియు ఆపరేటర్లు తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నెట్ వర్క్, సర్వర్లు నెమ్మదిగా ఉండడం వల్ల ప్రజలు ఓపిక నశించి తమపై దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. రెండు సార్లు వేలు ముద్రలు వేయించడం వల్ల కార్డు దారులు విసుగు చెందుతున్నారని చెప్పారు. వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులు వస్తున్నారని, వారికి రెండు సార్లు వేలి ముద్రలు వేయించడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. లేకపోతే మూకుమ్మడిగా రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం తహశీల్దార్ నిత్యానంద రాజుకు వినతిపత్రం అందజేశారు. నాగరాజు, గోవిందు, రవి కుమార్, తులసి రామ్, బాబు, వెంకటేష్, ఇసాక్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఎండియు ఆపరేటర్లు

టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు

- మరోసారి జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారం

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం ముందు 'భవిష్యత్తు గ్యారెంటీ' ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో మహాశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ మహిళ నాయకులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడారు. సంక్షేమమంటూ అభివృద్ధిని విస్మరించి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని వైసిపి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చిందంటే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేయడం ఖాయమన్నారు. 20 ఏళ్ల క్రితమే డ్వాక్రా మహిళలకు ఎన్నో ఆర్థిక ప్రయోజిత పథకాలు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లిదీవెన కింద రూ.15 వేలు, ఇంట్లోని మహిళలందరికీ నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. టిడిపి పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు రూపొందించిన మేనిఫెస్టోను గ్రామ వార్డుల్లో జనాలకు వివరించి ప్రచారం కల్పించాలని కోరారు. నాయకులు రామస్వామి, తిమ్మప్ప, రామకృష్ణ, బసవరాజు, మాబాష, విశ్వనాథ్ గౌడ్, శ్రీనివాస్ ఆచారి, బాలాజీ, మహిళలు శాంతి, రాజేశ్వరి, నూర్జహాన్, సాధిక బేగం, శ్రీదేవి, కుమారి పాల్గొన్నారు.


జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఉమాపతి నాయుడు


మాట్లాడుతున్న ఎఒ నాగ సరోజమ్మ

భూసారాన్ని బట్టి ఎరువులు వాడాలి

- జిల్లా వనరుల కేంద్రం ఎఒ నాగ సరోజమ్మ

ప్రజాశక్తి - మంత్రాలయం

భూ పరీక్షల ఆధారంగా భూసారం తెలుసుకొని ఎరువుల వాడకం ఉండాలని జిల్లా వనరుల కేంద్రం (ఆత్మ) ఎఒ సరోజమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని చిలుకలడోన గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో పత్తి పంట రక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పత్తి పంటలో మట్టి పరీక్షల అనంతరం తగిన మోతాదులో ఎరువులు వాడడం వల్ల లాభ సాటి వ్యవసాయం ఉంటుందన్నారు. పత్తి పంటలో ప్రస్తుతం (30 రోజుల తర్వాత) తెల్లదోమ, పచ్చదోమ అధికంగా ఉందని తెలిపారు. వేప నూనె 5 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని, ఎకరాకు 10 నుంచి 20 వరకు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మరీ ఉధృతంగా ఉంటే మోనోప్రోటోఫాస్‌ను పిచికారి చేయాలని తెలిపారు. 40 రోజుల తర్వాత ఎకరాకు 8 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేస్తే గులాబీ రంగు పురుగును తొలి దశలోనే నివారించవచ్చని పేర్కొన్నారు. భూమిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం వల్ల మొక్కలు ఎర్రబడతాయని, నివారణకు 20:20:0:13 లేదా 28:28:0 లేదా 14:35:14ను లీటర్ నీటిలో 5 గ్రాములు కలిపి పిచికారి చేసుకోవాలని కోరారు. జిల్లా వనరుల (ఆత్మ) ఎఇఒ రమాదేవి, ఎఒ జీరా గణేష్, ఎఇఒలు నరసింహుడు, రేఖా మాధురి పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా పేదలకు అండ

- సర్పంచి అంజినయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి జగన్మోహన్ ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ బీమా పథకం పేదలకు అండగా నిలుస్తోందని చెట్నిహళ్లి సర్పంచి అంజినయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని చెట్నిహళ్లి గ్రామానికి చెందిన శంకర్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన రాంపురం రెడ్డి సోదరులకు తెలిపారు. వైఎస్ఆర్ బీమా రూ.లక్ష వర్తింపు ఉందని తెలుసుకున్న ఎమ్మెల్యే తక్షణ సహాయం కింద రూ.10 వేల నగదును సర్పంచి అంజినప్పను ఆదేశించారు. ఎమ్మెల్యే చెప్పినట్లు సర్పంచి అంజినయ్య చేతుల మీదుగా మృతుని భార్య ఈరమ్మకు నగదును అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ వర ప్రసాద్ ఉన్నారు.

ప్రజాశక్తి
శనివారం 05 ఆగస్టు 2023
5
నంద్యాల



ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

- డిఇఒ కార్యాలయం ముందు యుటిఎఫ్ నిరసన



నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - నంద్యాల

బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి అయి రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు జీతాలు చెల్లించకపోవడం దారుణమని, ఇది రాష్ట్ర విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరే అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, రామ్ మోహన్‌లు విమర్శించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం డిఇఒ కార్యాలయం ముందు యుటిఎఫ్ అధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 12 నాటికి బదిలీలు, 25 నాటికి అన్ని క్యాడర్‌ల ప్రమోషన్‌ల ప్రక్రియ పూర్తి అయ్యిందన్నారు. ఆయినా క్యాడర్ స్ట్రెంత్ అప్డేషన్ పేరుతో, ఆర్థిక శాఖ అనుమతి పేరుతో జూన్, జూలై నెలలు జీతాలు చెల్లించలేదని విమర్శించారు. బదిలీలు, ప్రమోషన్‌లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశామని ఒక వైపు అధికారులు గొప్పగా చెపుతున్నారని, రెండో వైపు జీతాల చెల్లింపులో పూర్తి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారులు అలసత్వం వీడి జీతాల చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు పిసి హెచ్.బాలస్వామి, కె.రామ కృష్ణుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.ఐజయ్య, సీనియర్ నాయకులు బి.రామ పుల్లారెడ్డి, పి.గోపాల్, జి.మొహమ్మద్ హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకుంటే రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తాం : ఎస్‌టియు

నంద్యాల కలెక్టరేట్ : ఉపాధ్యాయుల జీతాలు చెల్లించకుంటే రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎస్‌టియు నాయకులు హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్‌టియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు నాయకులు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు గత నాలుగు సంవత్సరాలుగా ఉపాధ్యాయ సంఘాల సూచనలు, సలహాలు పెడచెవిన పెడుతూ అశాస్త్రీయ విధానాలను అనుసరిస్తూ పాఠశాల విద్యాశాఖను అభాసుపాలు చేస్తున్నారని అన్నారు. ఆర్థిక శాఖ అనుమతి లేకుండా జనవరిలో ఒకసారి పదోన్నతులు నిర్వహించి రద్దు చేసి మరొకసారి జూన్‌లో ప్రమోషన్లు నిర్వహించి నేటికీ మూడు నెలలు అయినప్పటికీ క్యాడర్ స్ట్రెంత్ నమోదులో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు.

ఇప్పటికైనా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ రెడ్డి, నాగరాజు, హరి ప్రియానందరెడ్డి, నాగేశ్వర్ నాయక్, రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టి.షడ్రక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లలర్పిస్తున్న నాయకులు టి.రమేష్ కుమార్, తోట మద్దులు తదితరులు

షడ్రక్ సేవలు, కృషి ఎనలేనిది

- ఆయన జీవితం ప్రజా సేవకు అంకితం : సిపిఎం

- జిల్లా వ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి - నంద్యాల

ఉమ్మడి కర్నూలు జిల్లా పార్టీ ఉద్యమంలో కామ్రేడ్ టి.షడ్రక్ సేవలు, చేసిన కృషి చాలా గొప్పదని, ప్రజల కోసం ఎటువంటి త్యాగానికైనా ముందుండే గొప్ప వ్యక్తి అని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, సీనియన్ నాయకులు తోట మద్దులు పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో కామ్రేడ్ టి.షడ్రక్ 3వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా షడ్రక్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, సీనియర్ నాయకులు తోట మద్దులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షడ్రక్ పార్టీ కర్నూలు జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు అనేక భూ పోరాటాలలో పాల్గొన్నారని తెలిపారు. ప్రజల కోసం కేసులను సైతం లెక్కచేయకుండా పోరాటం చేశారన్నారు. దళితుల సమస్యలపై కర్నూలు జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్ర నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన కమ్యూనిస్టు మహానుభావుడు కామ్రేడ్ షడ్రక్ అన్నారు. కర్నూల్ పేపర్ మిల్లులో ఉద్యోగం చేసుకుంటూ కార్మికుల సమస్యల మీద పోరాటం నిర్వహిస్తుండగా ఉద్యోగంలో నుంచి తీసివేసినా భయపడకుండా, వాళ్లతో లాలూచీ లేకుండా పోరాటం చేశారని తెలిపారు. అటువంటి వ్యక్తి 2020లో కరోనాతో జయించలేక మరణం పొందారన్నారు. ఆయన మనమధ్య లేకపోవడం చాలా బాధాకరమన్నారు. నంద్యాల అభివృద్ధి కావడానికి ఆయన పార్టీ జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు అనేక సలహాలు, సూచనలు ఇచ్చి ముందుకు నడిపించారని తెలిపారు. ఆయన ఆశయాలు ముందుకు వెళ్లాలంటే ప్రధానంగా యువకులు పార్టీలోకి **(మిగతా 6వ పేజీలో..)**

బకాయి వేతనాలు విడుదల చేయాలి

- సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి

- సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గ్రామ పంచాయతీ స్వచ్ఛ భారత్ కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసు రత్నం, జిల్లా సహాయ కార్యదర్శి వి.బాలవెంకట్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి గ్రామ పంచాయతీ స్వచ్ఛ భారత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాలలోని నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి కలెక్టర్ కార్యాలయం వరకు సిఐటియు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు భారీ ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీ కార్మికులు పోరాడి సాధించుకున్న 57, 132, 680 జీవోలను అన్ని జిల్లాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 132 ప్రకారం పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, జీవో 680 ప్రకారం ప్రతి కార్మికుడికి రూ. 10 వేలు వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు జీతాలు ఇవ్వని గ్రామ సర్పంచులు, అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. గత 6 నెలల నుంచి 18 నెలల వరకు ఉన్న బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని, కార్మికులకు టెండర్లతో సంబంధం లేకుండా విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపిఒ మంజుల వాణికి వినతి పత్రం అందజేశారు. డిపిఒ స్పందిస్తూ కార్మికులకు పెండింగ్ వేతనాలు పది రోజుల్లో వారి ఖాతాలో జమ చేస్తామని హామీ నిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తిమ్మరాజు, స్వచ్ఛభారత్ యూనియన్ జిల్లా నాయ కులు సుబ్బరాయుడు, హనుమంతు, త్యాగరాజు, నాగన్న, దేవదాసు, సుభద్రమ్మ, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు వలి, కార్మికులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు


విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొంటాం

- ఎపి రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పివి సునీల్ కుమార్

- ఫైర్ స్టేషన్ ప్రాంగణంలో ఫిల్లింగ్ స్టేషన్ ఫెడరేల్ పంపు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాబోయో రోజుల్లో ఎక్కడైన విపత్తు సంభవించిన వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ సిద్ధంగా ఉంటుందని ఎపి రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పివి సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం నంద్యాలలోని ఫైర్ స్టేషన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఫిల్లింగ్ స్టేషన్ ఫెడరేల్ పంపును జిల్లా ఎస్పీ కె.రఘు వీర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ రీజినల్ అధికారి కె.భూపాల్ రెడ్డి, జిల్లా అధికారి జయన్న తదితరులతో కలిసి పివి సునీల్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నంద్యాల ఫైర్ స్టేషన్ ప్రాంగణంలో ఫిల్లింగ్ స్టేషన్ ఫెడరేల్ పంపు ద్వారా వచ్చే ఆదాయాన్ని సిబ్బంది సంక్షేమనికి వినియోగిస్తామన్నారు. ప్రతినెలా కొన్ని నిధులు సమాకుర్చుకుంటామని తెలిపారు. ఫైర్ సిబ్బంది అనేక రిస్క్యు ఆపరేషన్‌లు చేపడుతుంటారని, ఎక్కడైనా విపత్తు వచ్చిందంటే మొదటగా ఉండేది ఫైర్, పోలీస్ డిపార్ట్మెంట్‌లేనన్నారు. కేవలం అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడే కాకుండా ఏదైనా వరదలు, రైలు ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించేది ఏపి విపత్తు స్పందన శాఖ, అగ్నిమాపక శాఖలు స్పందిస్తున్నాయన్నారు. రిస్క్యు ఆపరేషన్‌లను ఈ శాఖ సమర్ధవంతంగా చేస్తుందన్నారు. 15 ఫైనాన్స్ కింద పిఎం రాష్ట్రానికి రూ. 253 కోట్లు కేటాయించారన్నారు. ఆ నిధులను అగ్నిమాపక శాఖ ఆధునీకీకరణ కోసం వినియోగిస్తామని తెలిపారు. రాబోయో రోజుల్లో అగ్ని మాపక శాఖను బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ జనరల్ పివి సునీల్ కుమార్

విస్తారంగా మొక్కజొన్న సాగు

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

ప్రజాశక్తి - బనగానపల్లె

మొక్కజొన్న పంటపై రైతులు మక్కువ చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తుండడంతో మొక్కజొన్న పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వరికు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. బనగానపల్లె మండలంలో 3500 ఎకరాలలో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. మొక్కజొన్న పంట రైతులకు లాభదాయకంగా ఉంది. ఎకరానికి 30 నుండి 35 క్వింటాల దిగుబడి వస్తుండడం, తక్కువ పెట్టుబడి కావడంతో రైతులు అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ఇతర పంటలు గిట్టుబాటు లేకపోవడం, మొక్కజొన్న పంట గిట్టుబాటు అవుతుండంతో రైతులు అధికంగా మొగ్గ చూపుతున్నారు. నీరు తక్కువగా ఉన్న ప్రాంతాలలో వరి గిట్టుబాటు గాని రైతులు మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. ఎకరానికి రూ. 35 వేల నుండి రూ. 40 వేల వరకు ఆదాయం వస్తుండడంతో రైతులు

రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట

మొక్కజొన్న పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.

నంద్యాల న్యాయస్థానంలో హై టెన్షన్

- మాజీ మంత్రి శిల్పాకు బెయిలు మంజూరు

ప్రజాశక్తి - నంద్యాల లీగల్ : నంద్యాల న్యాయస్థానం రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, సెషన్ కోర్టులో మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డికి న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. ఒక కేసు నిమిత్తం కోర్టు సమాన్లు అందుకున్న మాజీ మంత్రి శిల్పా శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. కింది కోర్టులో 41 నోటీసులు, బెయిల్ బాండు లేనందున పైకోర్టులో అతనికి ఎదురైన సమస్యను ఆయన తరపు న్యాయవాదులు గట్టిగా వాదించారు. వాదనలు విన్న జడ్జి సీనియర్ సిటిజన్ కింద మాజీ మంత్రికి బెయిల్ మంజూరు చేశారు. తదుపరి హాజరు నిమిత్తం ఈ నెల 21వ తేదీ ఇద్దరు జామిన్ పూచికత్తు కింద కోర్టుకు హాజరుకావాలని తెలిపారు.

శ్రీశైల జలాశయం @ 859 అడుగులు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు : శ్రీశైలం జలాశ నీటిమట్టం శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 859 అడుగులకు చేరింది. ఎగువ జూరాల నుండి 48,419 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నాయి. సుంకేసుల, హంద్రీ నుండి నీటి ప్రవాహం నిలిచిపోయింది. అదే సమయానికి నీటి నిలువ సామర్థ్యం 102.8910 టిఎంసిలుగా నమోదయింది. గడిచిన 24 గంటలలో తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో 8,162 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 4.265 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేశారు. కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో ప్రస్తుతానికి విద్యుత్ ఉత్పత్తి చేయడం లేదు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - రుద్రవరం : పరిసరాల పరిశుభ్రతపై ఆలమూరు గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పంచాచయతీ కార్యదర్శి పాములేటి, సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. మరుగుదొడ్ల వాడకం, తడి పొడి చెత్తలను ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు. **మహానంది :** పరిసరాలను శుభ్రంగా ఉంచితే అంటు వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉండదని ఎంపీడీవో శివ నాగజ్యోతి అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీని నిర్వహించారు. సర్పంచి శ్రీలక్ష్మి, ఎంపిటిసి స్వరూప, పంచాయితీ కార్యదర్శి నాగ సంజీవరావు, ఏపీవో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రముఖ గైనకాలజిస్ట్, స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ అనూష గింజుపల్లి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మారుమూల గిరిజన గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు సరైన అవగాహన లేక నెల వారి వైద్య సేవలు పొందలేకపోతున్నారని, గర్భం దాల్చిన తర్వాత అరు నెలలయినా వైద్యులను సంప్రదించకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ గైనకాలజిస్ట్ స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ అనూష గింజుపల్లి తెలిపారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఫరూక్ నగర్ వద్ద ఉన్న మాక్స్‌వెల్ ఆసుపత్రిలో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 50 మంది గర్భిణులకు డాక్టర్ అనూష గింజుపల్లి అల్ట్రాసౌండ్ స్కానింగ్, థైరాయిడ్, షుగర్, బిపి చెకప్‌ను ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేకంగా గిరిజన ప్రాంతాల నుండి వచ్చిన మహిళల కోసం మాక్స్‌వెల్ ఆసుపత్రిలో ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ ప్రెగ్నెన్సీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మెడికల్ క్యాంపులో గర్భిణులకు సంబంధించే కాకుండా స్త్రీ వ్యాధి సంబంధిత వ్యాధులు రక్తస్రావం ఎక్కువగా అవడం, ఫ్రై బ్యాడ్ గడ్డలు ఉండటం, ఈసిఒడి వంటి వాటికి కూడా ఉచితంగా వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. ఉచిత మెడికల్ క్యాంప్‌లో ప్రముఖ జనరల్ మెడిసిన్ డాక్టర్ రాజ్ కుమార్ అవుకు, ఆసుపత్రి నిర్వాహకులు మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 24 నుండి 31 వరకు ఫ్రీ షుగర్ స్క్రీనింగ్ క్యాంపెయిన్

ప్రపంచ మధుమేహ దినోత్సవం నవంబర్ 14 నేపథ్యంలో యాక్సెస్ టూ డైబెట్స్ కేర్ సందర్భంగా ఈ నెల 24 నుండి 31 వరకు మాక్స్‌వెల్ హాస్పిటల్‌దలో ఫ్రీ షుగర్ స్క్రీనింగ్ క్యాంపియన్ నిర్వహిస్తున్నట్లు మాక్స్‌వెల్ హాస్పిటల్ ఏండి డాక్టర్ రాజ్ కుమార్ అవుకు తెలిపారు. మెడికల్ డిజార్డర్ ఇన్ ప్రెగ్నెన్సీ (గెస్టేషనల్ డైబేటీస్ మెల్లిటస్) ఉన్న గర్భిణులకు ఉచిత చెకప్, న్యూట్రిషన్ సలహాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


గర్భిణురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ అనూష గింజుపల్లి

శిథిలావస్థలో పంచాయతీ కార్యాలయం

ప్రజాశక్తి - చాగలమర్రి

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకు వచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. ఒండు వేల జనాభా కలిగిన ఒక గ్రామ పంచాయతీకి సచివాలయ భవనాన్ని అన్ని వసతులతో నిర్మించి సదుపాయాలు కల్పించారు. అయితే మండల పరిధిలోని శెట్టివీడు గ్రామంలో పురాతన కాలం నాటి గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ కార్యాలయంలో ఎలాంటి వసతులు లేవు. ఓ చిన్న గది మాత్రమే ఉంది. సచివాలయంకు జనాభా ఎక్కువ ఉండడంతో ఉన్న గది కూడా సరిపోడం లేదు. సచివాలయంకు మహిళా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన భవనంలో విధులు నిర్వహించడానికి సిబ్బంది భయపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి నూతన సచివాలయాన్ని, గ్రామ పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేయాలని సిబ్బంది, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

శెట్టివీడులో శిథిలావస్థలో పంచాయతీ కార్యాలయం



అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన కొనసాగుతున్నట్లు శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం 5వ వార్డ్ పరిధిలోని జంతర్ మంతర్ కాలనీ, తోమ్మంద్రు వీధి, సామిల్ వీధిలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సిఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 97 శాతం నెరవేర్చారని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయని వివరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, నంద్యాల విజయ డైరీ చైర్మన్ ఎస్.వి జగన్మోహన్ రెడ్డి, ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోపవరం నరసింహారెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, షేక్ ఆజాద్, కౌన్సిలర్ బాలబ్బి, డాక్టర్ శీలం సురేంద్రనాథ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, న్యాయవాది అశ్వర్థ రెడ్డి, ఇంజేటి రంగేశ్వర్ రెడ్డి, డీలర్ల సంఘం నాయకులు ప్రసాద్, దామోదర్ రెడ్డి, ఎస్ఐ వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వర్షంలోనూ సాగిన కార్యక్రమం : మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గ్రామ నాయకులు ఇంజేటి రంగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. వర్షం పడుతున్నా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వారు తెలిపిన సమస్యలను వింటూ పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తూ ముందుకు సాగారు. **నంద్యాల కలెక్టరేట్ :** నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 37వ వార్డు వైయస్ నగర్‌లో వార్డు ఇన్చార్జి టివి రమణ, వార్డు కౌన్సిలర్ టి.సావిత్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. వార్డులో లబ్ధిదారులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి అందిన సంక్షేమ పథకాలను వివరించారు. మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంశావళి, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే, నాయకులను సన్మానిస్తున్న దృశ్యం


నంద్యాలలో గడప గడప కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే


తనిఖీ చేస్తున్న ఎఒ

అనుమతి ఉన్న మందులనే అమ్మాలి : ఎఒ

- నంద్యాల పట్టణంలో ఎరువుల దుకాణాల తనిఖీలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల మండలంలోని ప్రతి ఎరువుల, పురుగు మందుల యాజమానులు ప్రభుత్వ అనుమతులు వున్న ఎరువులు, పురుగు మందులు మాత్రమే అమ్మాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు తెలిపారు. శుక్రవారం నంద్యాలలోని శ్రీ గురు రాఘవేంద్ర ఏజెన్సీస్, వాసవీ ఆగ్రో ఏజెన్సీస్, వెంకట సునిల్ ట్రేడర్స్, అన్నపూర్ణ పెస్టిసైడ్ సేల్స్ డిపో, విశ్వనాథ ఆగ్రో ఏజెన్సీస్, బిస్మిల్లా ఆగ్రో ఏజెన్సీస్‌లలో తనిఖీలు నిర్వహించారు. విశ్వనాథ ఆగ్రో ఏజెన్సీస్‌లో రూ.59,670 బయో స్టిములెంట్స్ పురుగు మందులు సరైన ధృవ పత్రాలు లేని కారణంగా అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ బోర్డ్ ప్రతి రోజూ అప్డేట్ చేయాలన్నారు. ఎరువులు, పురుగు మందులు కొన్న ప్రతి రైతుకి బిల్లు కచ్చితంగా ఇవ్వాలన్నారు. తప్పని సరిగా ఐఎఫ్ఎంఎస్ మెషీన్‌లో ఫిజికల్ స్టాక్, రిజిస్టర్ స్టాక్‌లు సమానంగా వుండాలని హెచ్చరించారు. ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు అమ్మితే వారిపై ఎఫ్‌సిఒ 1985 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్సీ గంగులకు సన్మానం

ప్రజాశక్తి - రుద్రవరం

మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డిని ఆళ్లగడ్డలోని ఆయన స్వగృహంలో రుద్రవరం మండలం కోటకొండ గ్రామ వైసిపి నాయకులు డేగాని రామకృష్ణతో పాటు పలువురు నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర జన వనరుల శాఖ ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన సందర్భంగా ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దాయన మీద అభిమానంతో ఇలాంటి ఉన్నత పదవులు కేటాయించడం హర్షనీయమన్నారు.


గంగుల ప్రభాకర్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు డేగాని రామకృష్ణ

ఘనంగా గంగా హారతి


హారతి ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

సుండి పెంట కాలనీలో ఆజాదికా అమృత్ మహోత్సవాలలో భాగంగా సెంట్రల్ వాటర్ కమిషన్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీశైలం ఆనకట్ట ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సేవ్ వాటర్ అవగాహన ర్యాలీని కాలనీలో చేపట్టారు. అనంతరం వ్యూ పాయింటు వద్ద సమావేశంలో సిడబ్ల్యుసి డిప్యూటీ సెక్రటరీ అక్షయ్ కుమార్ సాహు, డైరెక్టర్ తంగమణి డ్యాం ప్రాముఖ్యతపై మాట్లాడారు. నీటిని వృథా చేయరాదని పొదుపుతో వాడుకోవాలంటూ ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం శ్రీశైలం ఆనకట్టపై గంగా హారతిని వేద మంత్రాల నడుమ గంగమ్మకు హారతిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమములో సిడబ్ల్యుసి చీఫ్ ఇంజనీర్ రంగారెడ్డి, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కబీర్ బాష, సిడబ్ల్యుసి డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, హైడ్రాలజీ చీఫ్ ఇంజనీర్ కుమార్ డ్యామును పరిశీలించారు. వీరి వెంట ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్ రాజు, డిఇ శ్రీరామదాసు మోహన్, ఎస్పీఎఫ్ అధికారులు, స్థానిక పోలీసులు ఏఈలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

షడ్రక్ సేవలు, కృషి ఎనలేనిది

(5వ పేజీ తరువాయి..) రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.నాగరాజు, యేసురత్నం, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కెఎండి గౌస్, డి.లక్ష్మణ్, నాయకులు రామరాజు, బాల వెంకట్, చైన్‌సింగ్, హరి, కృష్ణ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** అలుపు ఎరుగని పోరాటయోధుడు షడ్రక్ ఆశయాలను సాధిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు హనుమంతు అన్నారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం నాయకులు పి,పకీరు సాహెబ్ వేణుగోపాల్, తదితరులు షడ్రక్ 3వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు హనుమంతు మాట్లాడుతూ షడ్రక్ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడుగా, సిపిఎం జిల్లా కార్యదర్శిగా, సిఐటియు జిల్లా కార్యదర్శిగా, వ్యకాసం జిల్లా అధ్యక్షుడిగా, కెవిపిఎస్ వ్యవస్థాపకుడుగా సుదీర్ఘ కాలం పాటు కార్మిక, కర్షక దళితుల, సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం పనిచేశారన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కోసం అనేక ఉద్యమాలు, జిల్లాలో పాదయాత్రలు నిర్వహించడం జరిగిందన్నారు. అనేక కార్మిక హక్కుల కోసం అలుపు ఎరగని పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాల్లో పెద్ద ఎత్తున భూ పోరాటాలు నిర్వహించి దళితులు బడుగు బలహీన వర్గాలకు భూ పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. దళితులకు అంటరానితనం వ్యతిరేకంగా ఉద్యమాల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు:** షడ్రక్, సున్నం రాజయ్యల ఆశయాలు సాధిస్తాం అని సిపిఎం నాయకులు అన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని డాక్టర్ ఏ ధనుంజయ మీటింగ్ హాల్ నందు సిపిఎం పట్టణ నాయకులు డి. రామ్ నాయక్ అధ్యక్షతన షడ్రక్, సున్నం రాజయ్యల వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా షడ్రక్, సున్నం రాజయ్యల చిత్ర పటాలకు సిపిఎం నాయకులు నరసింహ నాయక్, డి. సామన్నా, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, సీనియర్ నాయకులు ఏం రజాక్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, సీనియర్ పాత్రికేయులు జోసెఫ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా సిపిఎం ఉద్యమంలో షడ్రక్ సేవలు ఎనలేనివని అన్నారు. వారి జీవితాలు నేటితర నేటి ఉద్యమాలకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఈ


నందికొట్కూరు : షడ్రక్‌చిత్రపట్ట వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాబాష ఇస్మాయిల్, ఎన్. స్వాములు, వీరన్న, రామసుబ్బయ్య, గణపతి, అంబయ్య, సామెలు తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు:** స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం నాయకులు షడ్రక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి సామన్న మాట్లాడుతూ కార్మిక, బడుగు, బలహీన వర్గాల కోసం షడ్రక్ చేసిన పోరాటాలు చిరస్మరణీయం అన్నారు. షడ్రక్ ఆశయ సాధన కోసం పని చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మధు, తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల:** పట్టణంలోని లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో షడ్రక్, సున్నం రాజయ్యల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళ్లు అర్పించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు బి. రామాంజనేయులు అధ్యక్షతన వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా మండల సిపిఎం సీనియర్ నాయకులు వై ఎల్లయ్య, మండల కార్యదర్శి ఆర్ ఈశ్వరయ్య, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్. సాధిక్ హుస్సేన్, తదితరులు మాట్లాడారు. ఈ



షడ్రక్ చిత్రపటానికి నివాళులు అర్పించిన నాయకులు





కార్యక్రమంలో పార్టీ సభ్యులు మద్దిలేటి స్వామి, వెంకటరమణ,భాస్కర్, నాయక్,వెంకటరాముడు, రాములకోట భాష,విష్ణు, రామచంద్రుడు, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పూర్తి చేయండి : ఆర్‌డిఒ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఓ

ప్రజాశక్తి - చాగలమర్రి

ఈ నెల 13వ నాటికి ఓటర్ల ఇంటింటి సర్వేను పూర్తి చేయాలని బిఎల్‌ఓలకు నంద్యాల ఆర్‌డిఒ, ఆళ్ళగడ్డ నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2024 ఎన్నికలకు ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటి ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. చాగలమర్రి మండలంలో 17,406 కుటుంబాలున్నాయన్నారు. మండలంలో ఓటర్ల సర్వేను నిర్వహించేందుకు 52 మంది బిఎల్‌ఎలను నియమించినట్లు ఆయన తెలిపారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లు, వివాహమైన యువతుల పేర్లు తొలగించక పోవడం వలన, కొంత మందికి రెండు చోట్ల ఓట్లు నమోదు కావడం వలన ఈ తేడా ఉంటుందని, ఇంటింటి సర్వేలో ఇలాంటి పేర్లను తొలగించటానికి ప్రతి రాజకీయ పార్టీ నుండి ఆ పార్టీ ప్రధానకార్యదర్శి నియమిoచిన బూత్ లెవెల్ ఏజెంట్లు, బిఎల్‌ఓతో పాటు సర్వేలో పాల్గొని చనిపోయిన వారిని, ఊర్లో నివాసం లేని వారిని గుర్తించి వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించటానికి సహకరించాలని ఆర్‌డిఒ కోరారు. ఒకే ఇంటి నెంబరులో 18 ఓట్లు జాబితాలో నమోదైనట్లు తమ దృష్టికి వచ్చిందని వాటిని స్థానిక తహ శీల్దారు సుభద్రమ్మ, విఆర్‌ఓలు సర్వేలో పరిశీలించి వాటిలో ఎవైన తప్పు లుంటే సరిదిద్దుతారన్నారు. ఓటర్ల సర్వే కార్యక్రమానికి బిఎల్‌ఓలు ఖచ్చి తంగా విధులకు హాజరై ఇచ్చిన ప్రత్యేక యాప్లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళగడ్డ తహశీల్దారు హరినాథ్రావు, స్థానిక తహశీల్దారు సుభద్రమ్మ, ఎంపిడిఓ మహబుబ్ దౌలా. ఇఓపిఆర్డి సుదర్శనరావు, విఆర్‌ఓలు రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకట్ రెడ్డి

బేతంచర్ల: ఓటర్ల నమోదు కార్యక్రమంలో బిఎల్‌ఓలు చేసిన జాబితానే ఉపయోగపడుతుందని ఆర్డీవో వెంకట రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి అధ్యక్షతన బిఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవో వెంకట రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పరిశీలించే సమయంలో సంయమనం,నిబద్ధత కూడిన జీవన శైలిని అలవర్చుకోవాలని అన్నారు. ఎక్కడైనా ఇంటికి తాళం వేసిన ఇంటికి వారు ఉన్న సమయంలో వెళ్ళి, పరిశీలించాలన్నారు. ఓటరు నమోదులో ఫోటోప రిశీలిన అతి ముఖ్యమైన అంశమని, ఎక్కడైనా ఫోటోల తేడాల విషయంలో సంబంధిత బిఎల్‌ఓ లు జాగ్రత్తగా ఉండాలని,ఈ విషయంలో అలసత్వం వహిస్తే ఎన్నికల నియమావళి చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్స్ సత్య దీప్,దేవనాథ్,ఆర్ఐ శ్రీదేవి,సూపర్ వైజర్స్,బిఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ఓటమి భయంతోనే దాడులు : టిడిపి


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్నక మల్లెల రాజశేఖర్, సుబ్బారెడ్డి, తదితరులు



ప్రజాశక్తి - బేతంచెర్ల

ఓటమి భయంతోనే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి టిడిపి అధినేత చంద్రబాబా నాయుడుపై దాడులు చేయించాడని తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం పుంగనూరులో నారా చంద్రబాబునాయుడు పర్యటనలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు కర్రలు, రాళ్లదాడి చేశారని మండలంలోని గుటుపల్లె గ్రామంలో డోన్ నియోజకవర్గ టిడిపి అబ్జర్వర్ కాటమయ్య, రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ, టిడిపి నాయకులతో కలిసి వారు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. బేతంచేర్ల పట్టణంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చంద్రబాబు నాయుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. మండలం టిడిపి అధ్యక్షులు ఉన్నాం ఎల్లనాగయ్య, గౌరవ సలహాదారులు తిరుమలేష్ చౌదరి, బేతంచేర్ల పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, నాయకులు పాల్గొన్నారు. **బనగానపల్లె:** రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని వైసిపి నాయకులు అపహాస్యం, ఖూనీ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై చిత్తూరు జిల్లా పుంగనూరులో జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్ కూడలిలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమలో ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రాజెక్టుల పర్యటనలో భాగంగా చిత్తూరు జిల్లా పుంగనూరులో చంద్రబాబుపై, టిడిపి నాయకులపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైసిపి రౌడీలు, గుండాలతో రాళ్ళ వేయించడం, దాడులకు పాల్పడడం దారుణమన్నారు. రాష్ట్రంలో వైసిపి పాలనకు పతనం ప్రారంభమైందని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని రౌడీయిజంతో అడ్డుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు రౌడీయిజంతో కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగించాలన్నారు. లేకపోతే తాము కూడా తిరిగి దాడులు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వైసిపి నాయకులు రాష్ట్రం విడిచి పారిపోవాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి, నాయకులు వెంకట రామిరెడ్డి, హుస్సేనాపురం జాంగీర్, సైకిల్ షాప్ బేగ్, షబ్బీర్, మదనభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. **చాగలమర్రి :** చంద్రబాబు నాయుడుపై వైసిపి అల్లరి మూకలు రాళ్ళ దాడికి పాల్పడటం సిగ్గు చేటని టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్‌బాష, నంద్యాల జిల్లా బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లానాగరాజు అన్నారు. చాగలమర్రి పట్టణంలోని టిడిపి కార్యాలయంలో రాత్రి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రకటించారు. కార్యక్రమం లో టిడిపి నాయకులు కొలిమి హుసేన్‌వళి, షరీఫ్, మౌళాలి, హనీఫ్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు:** చంద్ర బాబు నాయుడుపై వైసిపి అల్లరి మూకలు రాళ్ళ దాడి చేశారని నందికొట్కూరు పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయ సూర్య, లాయర్ జాకీర్ హుస్సేన్, షకీల్ అహ్మద్,లాడన్, కళాకారు, బి. రాజన్న, భాస్కర్ రెడ్డి, పలుచని మహేశ్వర రెడ్డి, నిమ్మకాయ ల రాజు,తదితరులు పాల్గొన్నారు.


చాగలమర్రి : నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు


నందికొట్కూరులో ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

సంత జూటూరులో వైసిపి నేతలు ఘర్షణ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్


గాయపడిన దూదేకుల మౌలాలి

మండలంలోని సంత జూటూరు గ్రామంలో వైసిపి నేతల మధ్య శుక్రవారం ఉదయం ఘర్షణ చోటు చేసుకుంది. వైసిపి నాయకుడు దూదేకుల మౌలాలిపై అదే గ్రామానికి చెందిన ఉమ్మడి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి నరసింహారెడ్డి, ఉమ్మడి లక్ష్మీదేవి దాడి చేయడం జరిగిందని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు. దూదేకుల మౌలాలి నడిపి దస్తగిరి శ్రీనివాసరెడ్డిపై దాడి చేసిన ఘట నలో వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - ఆత్మకూరు

మైనార్టీ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామని ట్రైనింగ్ సెంటర్ ఇన్చార్జి సాజిత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు పరిసర ప్రాంతములలోని మైనార్టీ విద్యార్థులు పదవ తరగతి పాస్ అయి ఉండి, వయసు 40 సంవత్సరముల లోపు ఉన్నవారు ఆత్మకూరు నందు ఉర్దూ అకాడమీ వారి సెంటర్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి బ్యాచ్ 30 మంది మాత్రమే ఉంటారని, తరగతులు కూడా త్వరగా ప్రారంభిస్తున్నామన్నారు.

ఫార్మా రోబోతో అధిక దిగుబడి

ప్రజాశక్తి -ప్యాపిలి

తక్కువ శ్రమ ఎక్కువ దిగు బడి ఫార్మరోబో తో సాధ్యం అని జడ్పిటిసి బోరెడ్డి శ్రీరామారెడ్డి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ పుల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, ఉప సర్పంచ్ భువనేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఫార్మ రోబో అనేది నూతన సాంప్రదాయ వ్యవసాయ పద్ధతుల మధ్య ఖర్చును తగ్గించే యంత్రం అని,విత్తనాలు విత్తటం నుంచి మొక్కలు నాటటం, మందుల పిచికారీ,నారు నాటటం కలుపు తీయటం, ఇతర అంతర సేద్యం చేయడానికి సహాయపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోరమల్లి కార్జున రెడ్డి,బోరెడ్డి కృష్ణారెడ్డి, చిన్న రామాంజి పాల్గొన్నారు.

ఘనంగా సల్లా నాగరాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - చాగలమర్రి

స్థానిక ముత్యాలపాడు బస్టాండ్‌లోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానుల ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా టిడిపి బీసీ సెల్ ఫోక్ పర్సన్ సల్ల నాగరాజు యాదవ్ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సల్ల నాగరాజు యాదవ్ కే కోసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎస్‌అన్సర్ బాష నాగరాజు ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని దీవించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, గుత్తి నర్సింహులు కొలిమి షరీఫ్ ముళ్ళ అజీమ్ ముల్లాగఫార్, మౌలాలి హనీష్ ,బషీర్, కొలిమిఅషారఫ్, కామిశెట్టి రమేష్, నాయకులుపాల్గొన్నారు.


అభిమానుల మధ్య కేక్ కోస్తున్న నాగరాజు

కౌడిపీర్ల మహోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణం 17వవార్డు బంగారయ్య వీధి పెద్దమనుషుల సమక్షంలో చిన్నసరిగెత్తు కౌడిపీర్ల మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో శుక్రవారం ప్రారంభించారు. పీర్లచావిడి వద్ద గుండం ప్రజ్వలించి , పూలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బంగాయ్య వీధి చావిడిపెద్ద టిఇ.దినేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పూర్వీకుల నుంచి సాంప్రదాయ బద్దంగా నిర్వహించే ఈ కౌడిపీర్ల మహోత్సవంలో భాగంగా ఈ రోజు చిన్నసరిగెత్తు పూర్తయింది. రేపు మధ్య సరిగెత్తు ఎల్లుండి పెద్దసరిగెత్తు ఉత్సవాలు పూర్తయ్యాక పీర్లను ఊరేగించి గంగకు తరలించడంలో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దలు టైలర్ శ్రీను, పాండురంగయ్య, బాలాజీగౌడ్, సత్యాలు, రవికుమార్, లక్ష్మయ్య, లక్ష్మన్న, రామాంజి , శేషు, తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి చేయాలి

- ఆర్‌డిఒ, సిడిపిఒ

ప్రజాశక్తి - చాగలమర్రి

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీవో శ్రీనివాస్, సీడీపీవో తేజేశ్వరిలు తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో శుక్రవారం బాల్యవివాహాల నిరోధక చట్టం, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్ధాలు సంభవిస్తు న్నాయన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. లింగనిర్ధారణ చట్ట వ్యతిరేకమని, ఆడపిల్లలను కూడా మగ పిల్లలతో పాటు సమానంగా చదివిం చాల న్నారు. ఈ కార్యక్ర మంలో తహ సీల్దారు సుభద్రమ్మ, హరినాథరావు, ఐసీడీఎస్ సూపర్వైజర్ సుశీల, ఈవోపీఆర్డి సుదర్శన్రావు, సచివాలయ జిఎమ్ఎస్‌కెలు,వెల్ఫేర్ లు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ తేజేశ్వరి

వైసిపి నేత వెంకటేశ్వరరెడ్డి మృతి

ప్రజాశక్తి - పగిడ్యాల

వైసిపి నాయకుడు మందాడి వెంకటే శ్వర్ రెడ్డి గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. పగిడ్యాల గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు మందాడి వెంకటేశ్వర్ రెడ్డి కర్నూల్లో నివాసం ఉంటున్నారు. గురువారం గుండెపోటు రావడంతో హైదరాబాదుకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు.

గురువారం రాత్రి వెంకటేశ్వర రెడ్డి మృతదేహాన్ని పగిడ్యాల గ్రామానికి తరలించారు. విషయం తెలుసుకున్న టిడిపి నంద్యాల జిల్లా మాజీ అధ్యక్షులు గౌరవ వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఐజయ్య, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి పగిడ్యాల గ్రామానికి చేరుకొని మందాడి వెంక టేశ్వర్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమా లవేసి నివాళులర్పించారు. జడ్పిటిసి పుల్యాల దివ్య, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, శివానంద భారతి స్వామి వెంకటేశ్వర రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

అన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం


శ్రీశైలం క్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యం అన్నదాన పథకానికి హైదరాబాద్ చెందిన విన్నకోట సూర్య శంకర్ శ్రీనివాస్ రూ.1,05,000 లను దేవస్థానం పర్యవేక్షకులు నాగరాజుకు శుక్రవారం అందజేశారు. దాతలకు దేవస్తాన అధికారులు శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

వాహనాలు సీజ్ : ఎస్ఐ

ప్రజాశక్తి - నందికొట్కూరు



పట్టణ పరిధిలోని శుక్రవారం స్థానిక శ్లోక హైస్కూల్ వెనుక పరిసర ప్రాంతాలలో 6 అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వాహనాలను సీజ్ చేయడం జరిగిందని పట్టణ ఎస్సై ఎన్వి రమణ శుక్రవారం తెలిపారు. పట్టుబడ్డ వాహనాలను పరిశీలిస్తే తగిన ఆధారాలు ఏమి కనపడలేదని, సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. తగిన ఆధారాలు ఏమైనా ఉంటే వివరాలతో స్టేషన్లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పిల్లల ఎదుగుదలకు తల్లిపాలే ముఖ్యం

ప్రజాశక్తి-డోన్

పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని డోన్ ఇన్నర్ విల్ క్లబ్ అధ్యక్షురాలు కె షాలినిప్రకాష్ అన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవం సందర్భంగా డోన్ పట్టణంలోని ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పాతపేటలోని ప్రభుత్వాసుపత్రి నందు పట్టణానికి చెందిన ప్రతిమ పెళ్లిరోజు సందర్భంగా గర్భిణీ స్త్రీలకు,బాలింతలకు బ్రెడ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇన్నర్ విల్ క్లబ్ అధ్యక్షురాలు కె షాలినిప్రకాష్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని,పుట్టిన పిల్లలకు ముర్రిపాలు అందించడంతో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతిమ పెళ్లిరోజు సందర్భంగా బాలింతలకు, గర్భిణులకు బ్రెడ్లను పంపిణీ చేయడం అభినందనీ యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ గైనకాలజిస్ట్ డాక్టర్ అనురాధ,ఇన్నర్ విల్ క్లబ్ ఫౌండర్ రాజా సుజాత,ఇన్నర్ విల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు శారదాదేవి, మర్రిసరళదేవి, ముడియాలశైలజ, అనురాధ,మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.



బాలింతలకు బ్రెడ్లను పంపిణీ చేస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గిరి శివశంకర్ రెడ్డి

అయ్యా.. సిఎం గారూ..

మా బాధలు పట్టించుకోండి

- చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్నాం
- అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల ఆవేదన
- కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'అనేక ఏళ్లుగా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిన చాలీ చాలని వేతనాలతో ఉద్యోగం చేస్తున్నాం. మాకు వేతనాలు పెంచి చావు బతుకుల నుండి మమ్మల్ని ఆదుకోండి..' అంటూ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మొరపెట్టుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఈ నెల 2 నుండి కలెక్టరేట్ సమీపంలో రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కొనసాగాయి. ఈ దీక్షలకు ఎపి వైద్య, విధాన పరిషత్ కర్నూలు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గిరి శివ శంకర్ రెడ్డి నాయకత్వం వహించి మాట్లాడారు. వైద్య, ఆరోగ్య శాఖలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కింద చేరిన ఉద్యోగులు ఎప్పటికైనా రెగ్యులరవు తామని ఎదురు చూస్తున్నారన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులలో పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షల్లో వివిధ పిహెచ్‌సి, సిహెచ్‌సిల అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

భానుముక్కల సహకార సంఘానికి

ఉత్తమ అవార్డు



అవార్డును అందుకుంటున్న సహకార సంఘం అధ్యక్షులు నీలి శ్రీనివాసులు, కార్యదర్శి మునాఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని భానుముక్కల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉత్తమ అవార్డును అందుకుంది. శుక్రవారం విజయవాడలోని ఎ కన్వెన్షన్ హాల్‌లో ఎపి రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంకు 60 సంవత్సరాల వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా భానుముక్కల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు నీరు శ్రీనివాసులు, సీఈఓ అబ్దుల్ మునాఫ్‌లు ఉత్తమ అవార్డు, ప్రశంసపత్రంతో పాటు రూ. 50 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో 2022-2023 ఆర్థిక సంవత్సరం రుణాలు, ఎరువుల పంపిణీ, లోన్స్ రికవరీ, గోల్డ్ లోన్స్ ప్రారంభించిన సంవత్సర కాలంలో కోటి రూపాయల టర్నోవర్ సాధించడంతో రాష్ట్రంలో మొదటి ఉత్తమ అవార్డు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఎస్వి విజయ మనోహరి, కెడిసిసి బ్యాంకు సిఇఒ, డిసిసిబి డిపిడిఎం నాహీద సుల్తానా, డిసిసిబి డైరెక్టర్ సూర్య ప్రకాష్ రెడ్డి , డైరెక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి ఘనత మంత్రి బుగ్గనదే

ప్రజాశక్తి-డోన్

డోన్‌ను రాష్ట్రంలోనే ఏ నియోజకవర్గంలో లేని విధంగా అభివృద్ధి చేసిన ఘనత మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికే దక్కుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకీర్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని ఒకటో వార్డులోని కెయి కృష్ణమూర్తి నగర్ నందు 'మీ ఓటుకు ఒక మార్పు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎండి జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విద్య, వైద్యం అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చిరస్థాయిగా గుర్తిండిబోయే విధంగా చేశారని అన్నారు. అనంతరం డోన్ లో అభివృద్ధి చేసిన పనుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న ఎస్ఎండి జాకీర్ హుస్సేన్